dctelugu.com

# డిస్ట్రిక్ కాలమ్

జిల్లాల వార్తావాహిని

e-PAPER

కరీంనగర్ సపుంటి: 01 సంచిక: 03 07 శుక్రవారం, ఆగస్టు 2026

## విజయవంతంగా అగ్ని-4 బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం

### భారత్ మరో ఘనత



**భువనేశ్వర్ డీసీ**

భారతదేశం తన వ్యూహాత్మక రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసుకుంటూ మరో కీలక మైలురాయిని చేరుకుంది. దేశీయంగా అభివృద్ధి చేసిన మధ్యంతర శ్రేణి బాలిస్టిక్ క్షిపణి 'అగ్ని-4'ను గురువారం ఒడిశా తీరంలోని చాందీపూర్ ఇంటీగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి విజయవంతంగా ప్రయోగించారు. భారత రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ పర్యవేక్షణలో జరిగిన ఈ ప్రయోగ పరీక్షల్లో క్షిపణికి సంబంధించిన అన్ని రకాల ఆపరేషనల్, సాంకేతిక ప్రమాణాలు పూర్తిస్థాయిలో సాధించబడ్డాయి. రక్షణ రంగంలో దేశం సాధిస్తున్న స్వయంసమృద్ధికి, వ్యూహాత్మక రక్షణ విభాగానికి ఈ ప్రయోగం కీలక బలంగా నిలవనుంది. సుమారు 4,000 కిలోమీటర్ల దూరంలో ఉన్న అత్యంత సంక్లిష్టమైన లక్ష్యాలను కూడా ఖచ్చితత్వంతో ఛేదించగల సామర్థ్యం అగ్ని-4 క్షిపణి సొంతం.

మిగతా 2వ పేజీలో..

# సింగరేణి చరిత్రలో మరో మైలురాయి

### ఒడిశా నైనీ గని నుంచి తొలి బొగ్గు రైలు తెలంగాణకు చేరిక



**హైదరాబాద్ డీసీ**

సింగరేణి కాలరీస్ 136 ఏళ్ల సుదీర్ఘ చరిత్రలో ఒక సరికొత్త అధ్యాయం ఆవిష్కృతమైంది. ఒడిశాలోని సింగరేణికి చెందిన నైనీ బొగ్గు గని నుంచి బయలుదేరిన తొలి బొగ్గు రైలు, 1,131 కిలోమీటర్లు ప్రయాణించి మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి చేరుకుంది. తెలంగాణ సరిహద్దులు దాటి మరో రాష్ట్రంలో ఉన్న గని నుంచి బొగ్గు ఉత్పత్తి సాధించి, సొంత థర్మల్ విద్యుత్ కేంద్రానికి రవాణా చేయడం సంస్థ చరిత్రలోనే ఇదే తొలిసారి. 59 బాక్స్ వ్యాగన్లలో దాదాపు 4,000 టన్నుల అత్యుత్తమ 'జీ-10' గ్రేడ్ నాణ్యమైన బొగ్గు రవాణా కాగా, జైపూర్ కేంద్రానికి చేరుకున్న రైలుకు సింగరేణి ఉన్నతాధికారులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. ఈ చారిత్రాత్మక విజయంపై స్పందించిన ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సింగరేణి యాజమాన్యానికి, కార్మికులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పూర్తి సహకారం అందించడం వల్లే ఇది సాధ్యమైందని స్పష్టం చేశారు. 2015 ఆగస్టు 13న కేంద్రం కేటాయించిన ఈ నైనీ కోల్ బ్లాక్ అనుకూల అనుమతులు

మిగతా 2వ పేజీలో..

## ఇందిరమ్మ ఇళ్లు పేదలకు వరం

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



## 2021 నుంచి ప్రధాని మోదీ విదేశీ ప్రయాణాల ఖర్చు రూ.550 కోట్లకుపైనే

### పార్లమెంట్‌లో విదేశాంగ శాఖ వెల్లడి

**న్యూఢిల్లీ డీసీ**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనల వ్యయానికి సంబంధించిన వివరాలను విదేశాంగ శాఖ రాజ్యసభలో అధికారికంగా వెల్లడించింది. 2021 నుంచి ఇప్పటివరకు ప్రధాని విదేశీ ప్రయాణాల కోసం రూ.550 కోట్లకుపైగా ఖర్చయిందని విదేశాంగ శాఖ సహాయ మంత్రి పబిత్రా మార్గెరిటా లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. ఇందులో భాగంగా 2025లో మాత్రమే మొత్తం 23 దేశాలలో పర్యటించగా, దానికోసం సుమారు రూ.187 కోట్లు వ్యయమైనట్లు పేర్కొన్నారు. ఇక ప్రస్తుతం ఉన్న ఏడాదిలో (2026) ఇప్పటివరకు జరిగిన విదేశీ పర్యటనలకు రూ.74.58 కోట్లు ఖర్చయ్యాయని, జులై నెలలో ఇండోనేసియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల పర్యటనలు కూడా ఇందులో భాగమేనని వివరించారు. ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. ప్రధాని పర్యటనల ఖర్చు 2021లో రూ.36 కోట్లు, 2022లో రూ.55 కోట్లు, 2023లో రూ.93 కోట్లు, మరియు 2024లో రూ.109 కోట్లుగా నమోదైంది.

మిగతా 2వ పేజీలో..

## డిజటల్ చెల్లింపుపై చార్జీలు వసూలు

### లోక్‌సభ ఆమోదం



**న్యూఢిల్లీ డీసీ**

డిజిటల్ చెల్లింపులపై ఛార్జీల వసూలుకు లోక్‌సభ ఆమోదం యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)తో సహా పలు డిజిటల్ చెల్లింపు విధానాలపై ఛార్జీలు విధించేందుకు వీలు కల్పించే సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. 'పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్-2007'లో ప్రతిపాదించిన సవరణల ద్వారా బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థలు (పీఎస్పీలు) కొన్ని రకాల ఎలక్ట్రానిక్ లావాదేవీలపై రుసుములు వసూలు చేసే వెసులుబాటు పొందనున్నాయి. కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నోటిఫై చేసే చెల్లింపు విధానాలకు ఈ నిబంధన వర్తిస్తుంది. ప్రస్తుతం డిజిటల్ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎమ్‌డీఆర్) వసూలు చేయకూడదనే నిషేధాత్మక నిబంధన అమలులో ఉండగా, దానికి స్వస్తి పలుకుతూ ఈ ప్రతిపాదనలు తీసుకొచ్చారు. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను నిర్వహిస్తున్న బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలు, మౌలిక సదుపాయాల భాగస్వాములకు స్థిరమైన రాబడి మార్గాన్ని ఏర్పరచి, సాంకేతిక వ్యవస్థను మరింత పటిష్టం చేయడమే ఈ మార్పుల ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే, సాధారణ వినియోగదారులు, చిన్న వ్యాపారులపై భారం పడకుండా నామమాత్రపు రుసుములను మాత్రమే పరిశీలించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. లోక్‌సభలో చర్చ లేకుండానే ఈ బిల్లు ఆమోదం పొందింది. ఈ చట్ట సవరణల ఆధారంగా కేంద్ర ప్రభుత్వం భవిష్యత్తులో ఇచ్చే నోటిఫికేషన్ ద్వారా ఏయే డిజిటల్ చెల్లింపులపై రుసుములు విధించవచ్చో అధికారికంగా ఖరారు కానుంది.

# విజయవంతంగా అగ్ని-4 బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం

**మొదటిపేజీ తరువాయి..** అగ్ని శ్రేణికి చెందిన క్షిపణులు భారత వ్యూహాత్మక రక్షణ వ్యవస్థలో ఎంతో ప్రాధాన్యత కలిగినవి. ఈ ప్రయోగం ద్వారా భారత సైనిక దళాల సద్ధత, అణ్వాయుధ ప్రతిరోధక సామర్థ్యం మరింత పటిష్టమైందని రక్షణ రంగ నిపుణులు పేర్కొంటున్నారు. పరిధి, సాంకేతికత పరంగా నిరంతరం పటిష్టం చేస్తున్న ఈ క్షిపణి పరీక్షలు దేశభద్రతలో కీలక భూమిక పోషిస్తున్నాయి.

# 2021 నుంచి ప్రధాని మోదీ విదేశీ

## ప్రయాణాల ఖర్చు రూ.550 కోట్లకుపైనే

**మొదటిపేజీ తరువాయి..** గతేడాది పర్యటించిన దేశాల్లో ఫ్రాన్స్ పర్యటనకు అత్యధికంగా రూ.25 కోట్లు కాగా, అమెరికా పర్యటనకు రూ.16 కోట్లు, సౌదీ అరేబియాకు రూ.15 కోట్లు, బ్రెజిల్‌కు రూ.17 కోట్లు, చైనా పర్యటనకు రూ.10 కోట్లు, బ్రిటన్‌కు రూ.9 కోట్లు ఖర్చయ్యాయని కేంద్రం ప్రకటించింది. ప్రపంచంలోని వివిధ దేశాలతో ద్వైపాక్షిక, ప్రాంతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో సంబంధాలను మెరుగుపరుచుకోవడానికి, భాగస్వామ్యాలను పటిష్టం చేయడానికి ప్రధాని ఉన్నత స్థాయి పర్యటనలు ఎంతగానో దోహదపడతాయని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. 2021 ఏప్రిల్ నుండి 2025 డిసెంబర్ మధ్యకాలంలో చేపట్టిన ఈ విదేశీ పర్యటనల్లో కుదుర్చుకున్న పలు కీలక అవగాహన ఒప్పందాలు ఫలితంగా దేశానికి దాదాపు 381.8 బిలియన్ అమెరికన్ డాలర్ల (భారత కరెన్సీలో సుమారు రూ.31.69 లక్షల కోట్లు) విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ పర్యటనల వ్యయంతో పోలిస్తే, ప్రధాని విదేశీ ప్రయాణాలపై ఖర్చు చేసిన ప్రతి ఒక్క రూపాయికి దాదాపు రూ.66 వేల విలువైన విదేశీ పెట్టుబడులు దేశంలోకి వచ్చాయని అధికారిక గణాంకాలు పేర్కొంటున్నాయి.

# సింగరేణి చరిత్రలో మరో మైలురాయి

**మొదటిపేజీ తరువాయి..** రాక దీర్ఘకాలంగా నిలిచిపోగా, భట్టి విక్రమార్క స్వయంగా రెండుసార్లు ఒడిశా పర్యటించి అక్కడి ప్రభుత్వంతో చర్చలు జరిపి చిక్కుముడులు విప్పారు. దాని ఫలితంగానే 2025 ఏప్రిల్ 16న నైనీ గనిలో బొగ్గు ఉత్పత్తి వర్చువల్ విధానంలో ప్రారంభమై, తాజాగా ఇక్కడికి సరఫరా మొదలైంది. నైనీ గని 340.78 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వల సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఏడాదికి దాదాపు ఒక కోటి టన్నుల (10 మిలియన్ టన్నులు) ఉత్పత్తి లక్ష్యంతో, 36 ఏళ్ల జీవితకాలంతో పని చేయనుంది. నైనీ నుంచి క్రమం తప్పకుండా నాణ్యమైన బొగ్గు సరఫరా కావడం వల్ల మంచిర్యాల థర్మల్ ప్లాంట్‌లో ఇంధన కొరత తీరి, రాష్ట్ర విద్యుత్ రంగానికి మహర్దశ పడుతుందని అధికారులు వెల్లడించారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌తో పాటు గృహ, పారిశ్రామిక అవసరాలకు ఎలాంటి ఆటంకం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించాలనే ప్రభుత్వ లక్ష్యానికి ఈ పరిణామం మరింత బలాన్ని చేకూర్చనుంది.

## జొన్న రైతులకు శుభవార్త

**రూ. 994 కోట్ల బకాయిలు బ్యాంకు ఖాతాల్లో జమ**

**హైదరాబాద్, ఆగస్ట్6 :** తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో రాష్ట్ర రైతాంగానికి తీపి కబురు అందించారు. జొన్న పంట కొనుగోళ్లకు సంబంధించి రైతులకు చెల్లించాల్సిన రూ. 994 కోట్లను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ధాన్యం, పంటల కొనుగోలు విధానం వేగవంతంగా, పారదర్శకంగా సాగుతోందని, ఇది మొత్తం దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఆయన వ్యాఖ్యానించారు. అలాగే రాష్ట్రంలో ఎరువుల పంపిణీని మరింత పారదర్శకం చేసేందుకు రూపొందించిన 'తెలంగాణ ఎరువుల యాప్' విజయవంతం కావడంతో, దాని ప్రమాణాల ఆధారంగానే కేంద్ర ప్రభుత్వం 'ఫెర్టిలైజర్ ఫీల్డ్ స్టాఫ్' (ఈఈ÷ూ) వ్యవస్థను అందుబాటులోకి తెచ్చిందని మంత్రి స్పష్టం చేశారు. ఈ నూతన ఎరువుల పంపిణీ విధానాన్ని నేటి నుంచి మరో 10 జిల్లాలకు విస్తరిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో సంప్రదాయ పంటలతో పాటు వాణిజ్య పంటలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ఆయిల్ పామ్ సాగు విస్తరణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, రైతులకు అవసరమైన ప్రోత్సాహకాలు, అవగాహన అందించాలని ఆదేశించారు. తెలంగాణను ఆయిల్ పామ్ ఉత్పత్తిలో అగ్రగామిగా నిలపడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. ఇదే సమావేశంలో చేనేత రంగానికి సరికొత్త సాంకేతికతను జోడించేలా నిర్వహించిన హ్యాండ్లూమ్ హ్యాకథాన్ లో విజేతగా నిలిచిన ప్రతిభావంతులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించి, ఘనంగా సన్మానించారు. చేనేత కార్మికుల నైపుణ్యానికి సాంకేతికత తోడైతే మార్కెటింగ్ రంగంలో అద్భుతాలు సృష్టించవచ్చని పేర్కొన్నారు. అన్నదాతల సంక్షేమం, వ్యవసాయ రంగం బలోపేతమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు.

# బయోగ్యాస్ ఉత్పత్తికి విప్లవాత్మక ప్రోత్సాహం: రూ.23,731 కోట్లతో 'గోబర్ధన్' పథకానికి కేంద్ర కేబినెట్ ఆమోదం

**న్యూఢిల్లీ**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రిమండలి సమావేశంలో దేశీయ ఇంధన రంగాన్ని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. బయోగ్యాస్ ఉత్పత్తిని భారీగా ప్రోత్సహించే లక్ష్యంతో రూ.23,731 కోట్ల భారీ అంచనా వ్యయంతో 'గోబర్ధన్' జాతీయ సర్క్యులర్ బయోఎనర్జీ పథకానికి కేబినెట్ పచ్చజెండా ఊపింది. ఈ ప్రతిష్టాత్మక పథకాన్ని 2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి 2035-36 వరకు పదేళ్ల పాటు కేంద్ర ప్రభుత్వం విస్తృతంగా అమలు చేయనుంది.

ఈ పథకం ద్వారా వ్యవసాయ అవశేషాలు, పశువుల పేడ మరియు ఇతర సేంద్రీయ వ్యర్థాలను సమర్థవంతంగా వినియోగించి కంప్రెస్డ్ బయోగ్యాస్ ఉత్పత్తిని వేగవంతం చేస్తారు. ప్రస్తుతం ఉన్న దేశీయ సీబీజీ ఉత్పత్తిని దాదాపు పది రెట్లకు పెంచడమే ప్రాథమిక లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర మంత్రులు వెల్లడించారు. దీనివల్ల విదేశాల నుంచి దిగుమతి చేసుకునే సహజవాయువు పై ఆధారపడటం తగ్గి, దేశీయ ఇంధన భద్రత మరింత పటిష్టమవుతుంది. అంతేకాకుండా, వ్యర్థాల నిర్వహణ సులభతరం కావడంతో పాటు రైతులు, గ్రామీణ పారిశ్రామికవేత్తలు మరియు సహకార సంఘాలకు సరికొత్త ఆదాయ మార్గాలు అందుబాటులోకి వస్తాయి.

దీంతో పాటు రవాణా రంగానికి సంబంధించి అస్సాం రాష్ట్రంలో రూ.8,970 కోట్ల అంచనా వ్యయంతో అత్యంత కీలకమైన నాలుగు లేన్ల జాతీయ రహదారి నిర్మాణ ప్రతిపాదనకు కూడా కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది.

# ఆగస్టు 15న ల్యామినేటెడ్ రేషన్ కార్డుల పంపిణీ

**తెలంగాణలో 1.05 కోట్ల కొత్త కార్డులు**



**హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఆహార భద్రత కల్పించడమే లక్ష్యంగా నూతన పిడిఎస్ రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నూతన రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను ప్రారంభించనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఈ బృహత్తర కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1.05 కోట్ల నూతన, ల్యామినేటెడ్ రేషన్ కార్డులను అర్హులకు అందజేయనున్నారు. ముఖ్యమంత్రి స్వయంగా సంగారెడ్డి జిల్లాలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనుండగా, అదే సమయంలో రాష్ట్రంలోని మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకకాలంలో పంపిణీ మొదలుకానుంది. స్వాతంత్ర్య దినోత్సవం రోజున మధ్యాహ్నం 2:00 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు నియోజకవర్గాల వారీగా ఈ వేడుకలు జరుగుతాయి. కార్యక్రమాన్ని సజావుగా పూర్తి చేసేందుకు వీలుగా ప్రతి నియోజకవర్గ పర్యవేక్షణ బాధ్యతలను ఆర్డీవోలకు అప్పగించారు. స్థానిక ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో పంపిణీ చేపట్టనున్నారు. కార్డుల సేకరణ కోసం వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వేదికల వద్ద తాగునీరు సహా ఇతర మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పంపిణీ ప్రక్రియ ముగిసిన వెంటనే సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

## విద్యార్థులతో రాహుల్ సభకు ఆటంకం

**అనుమతి రద్దుపై మండిపడ్డ రాహుల్**

**న్యూఢిల్లీ :** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో విద్యార్థులతో రాహుల్ గాంధీ నిర్వహించాల్సిన సమావేశానికి అనుమతి రద్దు కావడం వివాదంగా మారింది. ఆగస్టు 8న జరగాల్సిన 'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమానికి రెండు రోజుల ముందే వేదిక అనుమతిని రద్దు చేశారు. ఈ కార్యక్రమం జరగాల్సిన కేపీ గ్రౌండ్ యజమాని అయిన కాయస్థ పాఠశాల ట్రస్ట్.. అలహాబాద్ హైకోర్టు ఆదేశాలను కారణంగా చూపిస్తూ అనుమతిని వెనక్కి తీసుకుంది. 'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమానికి అనుమతి రద్దు చేయడంపై రాహుల్ గాంధీ ఉత్తరప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. తనను అడ్డుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అయితే, తనను ఎవరూ ఆపలేరని, విద్యార్థుల సమస్యలపై తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అలహాబాద్ విశ్వవిద్యాలయంలో ఫీజుల పెంపు, సీట్ల

# ఆగస్టు 15న కొత్త ఆసరా పెన్షన్లు

- ఇందిరమ్మ ఇళ్లు పేదలకు వరం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ గుదిమళ్లలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొని మాట్లాడారు. ఇందిరమ్మ ప్రభుత్వం ఎల్లప్పుడూ పేదల పక్షానే నిలబడుతుందని, వారి సంక్షేమానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కొత్తగా దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆసరా పెన్షన్లు అందజేస్తామని ఈ సందర్భంగా ఆయన కీలక ప్రకటన చేశారు.

ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వ సామాజిక భద్రతా పథకంలో భాగంగా వృద్ధులు, విధవలు, నేత కార్మికులు, కల్లు గీత కార్మికులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, ఎయిడ్స్ బాధితులకు, ఫైలేరియా బాధితులకు నెలకు రూ.2,016 చొప్పున ఆర్థిక సాయం అందుతోంది. అలాగే దివ్యాంగులకు, తీవ్రమైన శారీరక రుగ్మతలు ఉన్నవారికి నెలకు రూ.4,016 చొప్పున పింఛను అందజేస్తున్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరిని ఈ పరిధిలోకి తీసుకొస్తామని మంత్రి తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికి సంబంధించి, రాష్ట్రంలో సమగ్ర భూ సర్వే చేపట్టి 'భూ భారతి' ద్వారా లబ్ధిదారులకు డిజిటల్ మ్యాప్‌తో కూడిన భూమి హక్కు పత్రాలను ప్రభుత్వమే ఉచితంగా అందజేస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. అనర్హుల వద్ద ఉన్న పాస్ పుస్తకాలను రద్దు చేస్తామని, అర్హులైన పేదలకు ఎలాంటి అన్యాయం జరగనివ్వమని స్పష్టం చేశారు. వీటితో పాటు మరో రెండు మూడు రోజుల్లోనే ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియను ప్రారంభించనున్నట్లు, రాబోయే మొదటి పంటకే సాగునీరు అందిస్తామని వెల్లడించారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలెవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని పొంగులేటి భరోసా ఇచ్చారు.

## కృష్ణా నీటి వాటాలను తేల్చండి

**బోర్డు సమావేశం ఏర్పాటు చేయాలని కోరిన ఎపి**

**అమరావతి :** కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఛైర్మన్‌కు ఏపీ ప్రభుత్వం లేఖ రాసింది. కృష్ణా జలాల అంశంపై చర్చించేందుకు బోర్డు సమావేశం ఏర్పాటు చేయాలని రాష్ట్ర జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కోరారు. శ్రీశైలం, సాగర్‌లో అందుబాటులో ఉన్న నీటిలో ఏపీ, తెలంగాణ వాటాలు ఖరారు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా నీటిని జాగ్రత్తగా వాడుకోవాల్సిన అవసరముందని ఏపీ ప్రభుత్వం అభిప్రాయపడింది. రెండు రాష్ట్రాలకు నీటి కేటాయింపులపై చర్చించి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరింది. నీటి వాటాల సింగిల్ పాయింట్ అజెండాతో సమావేశం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. బోర్డు లేదా త్రిసభ్య కమిటీ సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేసింది.

# రోడ్డుప్రమాదంలో గ్యాంగ్‌స్టర్ అతీక్ కొడుకు దుర్మరణం

**వేగంగా కారు డివైడర్‌నుఢీకొనడంతో ప్రమాదం**

**లక్నో :** ఉత్తర్‌ప్రదేశ్ గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్ చిన్నకొడుకు అబన్ అహ్మద్ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. జైల్లో ఉన్న తన సోదరుడిని కలిసేందుకు వెళ్తుండగా.. ఝాన్సీ ప్రాంతంలో హైవేపై అతడు ప్రయాణిస్తున్న కారు డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాద సమయంలో వాహనంలో అబన్ తో పాటు మరో నలుగురు వ్యక్తులు ఉన్నారు. ప్రమాద తీవ్రతకు కారు ముందుభాగం నుజ్జునుజ్జ య్యింది. అబన్‌తో పాటు మరో వ్యక్తి కూడా మృతి చెందారు. అతి వేగమే ఘటనకు కారణమని పోలీసులు ప్రాథమికంగా వెల్లడించారు. గ్యాంగ్‌స్టర్, మాజీ ఎంపీ అతీక్ అహ్మద్‌పై దోపిడీ, కిడ్నాప్, హత్య కేసులు ఉన్నాయి. బీఎస్పీ ఎమ్మెల్యే రాజుపాల్ హత్య కేసులో కీలక సాక్షి అయిన ఉమేశ్ పాల్‌ను హత్య చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలోనే ఓ కేసులో జైల్లో ఉన్న అతీక్, అతడి సోదరుడిని 2023 ఏప్రిల్‌లో పోలీసులు వైద్య పరీక్షలకు తీసుకెళ్తుండగా.. ముగ్గురు దుండగులు వారిని కాల్చిచంపారు. కాగా.. పాల్ హత్య కేసులో నిందితుడిగా ఉన్న అతీక్ మూడో కుమారుడు అసద్ పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. ఇక, అతీక్ మరో ఇద్దరు కుమారులు

dctelugu.com

# డిస్ట్రిక్ కాలమ్

జిల్లాల వార్తావాహిని

e-PAPER

కరీంనగర్ సపుంటి: 01 సంచిక: 03 07 గురువారం, ఆగస్టు 2026

# పంద్రాగస్టు వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- విధిగా ప్రోటోకాల్ పాటించాలి
- వసతుల కల్పనలో ఇబ్బందులు రానీయొద్దు
- కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా




**కరీంనగర్, మదర్ న్యూస్ ప్రతి నిది :**
పంద్రాగస్టు వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, అదనపు డీసీపీ వెంకటరమణతో కలిసి వివిధ శాఖల అధికారులతో పంద్రాగస్టు ఏర్పాట్లపై గురువారం సమీక్ష నిర్వహించారు. వేడుక సజావుగా సాగేలా చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రోటోకాల్ సమస్య తలెత్తకుండా నిబంధనల ప్రకారం ఏర్పాట్లు చేయాలని సూచించారు. వేదిక వద్ద సీటింగ్, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. దేశభక్తి పెంపొందించే సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షం కురిసినా ప్రోగ్రాం కు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని.. ప్రోటోకాల్ నిబంధనలు పాటిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని పోలీస్ శాఖ అధికారులను ఆదేశించారు.

### స్టాల్స్, శకటాల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలి

వివిధ శాఖల పనితీరు తెలిసేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ, గృహ నిర్మాణ శాఖ, ఆర్టీసీ, వైద్యశాఖ, పంచాయతీరాజ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖల పనితీరు తెలిసేలా ప్రత్యేక స్టాల్స్ , శకటాలు ఏర్పాటు చేయించాలన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు అందించే రుణాలతో కూడిన స్టాల్స్, శకటాలు ఏర్పాటు చేయాలన్నారు. సెర్ప్, మెప్మా ఆధ్వర్యంలో తయారుచేస్తున్న ఉత్పత్తులను ప్రదర్శించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల శకటం, డ్రగ్స్ నియంత్రణకు పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలతో శకటం ఏర్పాటు చేయాలన్నారు. ఎల్ నినో వర్షాభావ పరిస్థితులను తట్టుకునేలా తీసుకుంటున్న చర్యలతో స్టాల్ ఏర్పాటు చేయాలని ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వ్యవసాయం, ఫిషరీస్ శాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా స్టాల్ ఏర్పాటు చేయాలన్నారు.వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేయాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అంబులెన్స్, ఫైరింజన్ అందుబాటులో ఉంచాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, పార్కింగ్ లో ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రశంసా పత్రాలు అందించేందుకు ఉత్తమ పనితీరు కనబరిచే ఉద్యోగులను ఎంపిక చేయాలని సూచించారు. వేడుకలకు హాజరయ్యే అతిథులు, స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజలకు విద్యార్థులకు మీడియా కు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. అవసరమైన తాగునీరు, టెంట్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టం తదితర ఏర్పాట్లను ఆయా శాఖల అధికారులు ఏర్పాట్లు చేయాలి అని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఆగస్టు 10 నాటికి సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించాలి

- పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- పీఎం కుసుమ్ పథకం కింద 1 మెగావాట్ల

  సోలార్ ప్లాంట్‌ను త్వరగా వినియోగంలోకి తీసుకురావాలి
- అవసరమైన విద్యుత్ కనెక్షన్లు వెంటనే పూర్తి చేయాలి
- కాల్వ శ్రీరాంపూర్ మండలంలో సోలార్ ప్లాంట్

  పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**పెద్దపల్లి డీసీ :**
కాల్వ శ్రీరాంపూర్ మండలంలో పీఎం కుసుమ్ పథకం కింద నిర్మించిన 1 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్‌కు సంబంధించిన మిగిలిన ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేసి ఆగస్టు 10 నాటికి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను పరిశీలించి పనుల పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ.. పీఎం కుసుమ్ పథకం కింద ఏర్పాటు చేసిన 1 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణ పనులు పూర్తయ్యాయని తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి ప్రారంభానికి అవసరమైన విద్యుత్ కనెక్షన్లు, సాంకేతిక ప్రక్రియలను వెంటనే పూర్తి చేసి ఎలాంటి జాప్యానికి తావు లేకుండా ఆగస్టు 10 నాటికి ప్లాంట్‌ను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించడంలో ఇటువంటి సోలార్ ప్రాజెక్టులు కీలకమని పేర్కొన్న కలెక్టర్, ప్రాజెక్టును నిర్ణీత గడువులో పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చి విద్యుత్ త్పత్తిని ప్రారంభించేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూనే మిగిలిన అన్ని ప్రక్రియలను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాముడు, పీఏసీఎస్ చైర్మన్ రాంచందర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మామిడి తిరుపతి రెడ్డి, పీఏసీఎస్ సీఈవో కోలేటి శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


# పంచాయతీ భవన నిర్మాణాలు ప్రారంభించాలి

- గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి
- ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తులు పరిష్కరించాలి
- పంచాయతీ విద్యుత్ బిల్లుల చెల్లింపు అభినందనీయం
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్ డీసీ :**
మంజూరైన పంచాయతీ భవన నిర్మాణాలు వెంటనే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా పంచాయతీ శాఖ సమీక్ష సమావేశం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ స్థలం గుర్తించి నిర్మాణానికి ఉత్తర్వులు మంజూరైన పంచాయతీ భవనాల నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని అన్నారు. నిర్మాణ దశలో ఉన్న భవనాల పనులను వేగవంతం చేయాలన్నారు. ఎల్ ఆర్ ఎస్ పెండింగ్ దరఖాస్తులను రెవెన్యూ, పంచాయతీ, ఇరిగేషన్ శాఖలు సమన్వయంతో పరిష్కరించాలని అన్నారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మరణించిన మల్టీపర్పస్ కార్మికుల కుటుంబాలకు రావలసిన అన్ని ప్రయోజనాలు త్వరితగతిన అందేలా చూడాలని తెలిపారు. కార్మికులకు అన్ని రకాల బీమా ప్రీమియాలు చెల్లించాలని సూచించారు. గ్రామ పంచాయతీలకు సంబంధించి పెండింగ్ లో ఉన్న విద్యుత్ బిల్లులలో 49 శాతం పంచాయతీల నుండి చెల్లించడం అభినందనీయమని అన్నారు. ఎంపీఓలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ పెండింగ్ పనులను పర్యవేక్షించాలని అన్నారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన పనులకు సంబంధించిన నివేదికలు ఎప్పటికప్పుడు సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, డి ఎల్ పి ఓ లు, ఎంపీఓలు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ టు కొత్తపల్లి నాలుగు వరుసల రోడ్డు విస్తరణకు హైకోర్టు బ్రేక్

**కరీంనగర్ డీసీ**
కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామం నుంచి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణ వ్యవహారంలో హైకోర్టు కీలక మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ రహదారి విస్తరణ అంశంపై దాఖలైన రిట్ పిటిషన్లపై బాధితులకు స్టేటస్ కో యధాత స్థితి కొనసాగించాలని ఆదేశిస్తూ హైకోర్టు ఉపశమనం కల్పించింది. మొదట ప్రధాన పిటిషనర్లయిన 11 మంది దాఖలు చేసిన రిట్ పిటిషన్ పై ఆగస్ట్ 4న హైకోర్టు విచారణ చేపట్టింది. దీంట్లో భాగంగా 11 మంది మందికి చెందిన ఆస్తులపై ప్రస్తుతం ఉన్న పరిస్థితి కొనసాగించాలని ఆదేశిస్తూ న్యాయమూర్తి మధ్యంతర ఉత్తర్వులు స్టేటస్ కో జారీ చేశారు. పిటిషనర్ల తరపున న్యాయవాదులు వి.వెంకట సుబ్రహ్మణ్యం, దాసరి శ్రీనివాస్ రెడ్డి వాదనలు వినిపించారు. ఈ కేసు తదుపరి విచారణ 11 ఆగస్టు 2026 కు వాయిదా పడింది. ఈ నాలుగు వరసల రహదారి విస్తరణ అంశంపై పిటిషనర్లుకు హైకోర్టులో స్టేటస్ కో ఉత్తర్వులు జారీ చేయడం హుస్నాబాద్ నియోజకవర్గం లో చర్చనీయాంశశీ గా మారింది.




**MAIN CASE NO: W.P.No.25459 OF 2026**

**PROCEEDING SHEET**

| DATE | ORDER | OFFICE NOTE |
|---|---|---|
| 04.08.2026 | SN,J<br>W.P.No.25459 OF 2026<br>Heard Sri Dasari Srinivas Reddy, learned counsel appearing on behalf of the petitioners, learned Assistant Government Pleader for Roads and Building appearing on behalf of the respondent Nos.1 & 2 and the learned Assistant Government Pleader for Panchayatraj appearing on behalf of respondent No.3.<br>List on 11.08.2026 in the 'MOTION LIST'.<br>Status-quo existing as on the date to be maintained in respect of houses bearing Nos.4-37, 5-33, 6-43, 7-87, 7-84/1, 4-39/1, 5-31, 7-88, 5-65 and 5-32, situated at Sundaragiri Village, Chigurumamidi Mandal, Karimnagar District, till 11.08.2026.<br>SN, J<br>dv | |

# కరీంనగర్ బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా సాయిని మల్లేశం



**కరీంనగర్ డీసీ**
కరీంనగర్ జిల్లా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధ్యక్షుడిగా సాయిని మల్లేశంను పార్టీ అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు, జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకత్వానికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు.

# డబ్బులు జమచేస్తూ బ్యాంకులో గుండెపోటుతో వ్యక్తి మృతి

**గన్నేరువరం డీసీ :**
గుండ్లపల్లి ఎస్బీఐ బ్యాంకులో గుండెపోటుతో వ్యక్తి మృతి చెందాడు. గురువారం జంగపెల్లి గ్రామానికి చెందిన అనుమండ్ల బాలయ్య (65) గుండ్లపల్లి ఎస్బీఐ బ్యాంకు లో డబ్బులు జమ చేస్తున్న సమయంలో సడన్ గా స్ట్రోక్ రావడంతో అక్కడే కుప్పకూలిపోయాడు.

# జయశంకర్ సార్ పోరాటం చిరస్మరణీయం



**కరీంనగర్ డీసీ :**
తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ చేసిన పోరాటం చిరస్మరణీయం అని.. ఆయన ఆశయాలు, అందించిన స్ఫూర్తి నేటి తరాలకు ఆదర్శమని అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతిని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ సందర్భంగా ఆయా శాఖల ఉన్నతాధికారులు ఆ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ప్రత్యేక రాష్ట్ర సాధనకు ఆయన చేసిన పోరాటాలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ స్వామి, ఆర్డీవో షర్మిల, బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మేడ్చల్--మల్కాజిగిరి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా గిరివర్ధన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన తిండేరు హనుమంతరావు

**ఉప్పల్ :**





భారతీయ జనతా పార్టీ మేడ్చల్--మల్కాజిగిరి అర్బన్ జిల్లా అధ్యక్షు డిగా నూతనంగా ఎన్నికైన గిరివర్ధన్ రెడ్డిని పార్టీ నాయకుడు శ్రీ తిండేరు హను మంతరావు మర్యాద పూర్వ కంగా కలిసి శుభాకాంక్షలు తెలిపా రు.ఈ సందర్భంగా గిరివర్ధన్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి అభినం దనలు తెలియజేసిన తిండేరు హను మంతరావు, పార్టీ బలోపేతానికి ఆయన నాయకత్వం దోహదప డుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా పార్టీని మరింత ప్రజల్లోకి తీసుకెళ్ల డంతో పాటు కార్యకర్తలకు అండగా నిలు స్తూ విజయవం తంగా బాధ్యతలు నిర్వహిం చాలని ఆకాంక్షిం చారు.ఈ సందర్భంగా గిరివర్ధన్ రెడ్డి తనపై పార్టీ అధిష్ఠానం ఉంచిన విశ్వా సానికి కృతజ్ఞతలు తెలుపుతూ, పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా కార్య కర్తలందరినీ సమన్వయం చేసుకుని జిల్లా అభివృద్ధి, పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొని గిరివర్ధన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

## బూత్ స్థాయిలో బీఆర్ఎస్ పటిష్టం.. గ్రామస్థాయిలో గులాబీ సైన్యం సన్నద్ధం

**బీఎల్ఏలకు ఘన సత్కారం..**

**అశ్వారావుపేట మండలంలో ఎన్నికల సన్నాహాలకు వేగం పెంచిన పార్టీ శ్రేణులు...**





**అశ్వారావుపేట :**

బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత పటిష్టం చేసే దిశగా అశ్వారావుపేట మండల బీఆర్ఎస్ నాయకత్వం అడుగులు వేస్తోంది. ఓటరు జాబితా సంబంధిత కార్యక్రమాల్లో చురుగ్గా పనిచేస్తూ అధిక శాతం పనులు పూర్తి చేసిన సందర్భంగా మండలంలోని బీఆర్ఎస్ బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏ)కు పార్టీ నాయకులు ఘనంగా సన్మానం చేశారు. మండల కోఆర్డినేటర్ జూపల్లి రమణారావు, మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్ మూర్తి, సీనియర్ నాయకులు మోహన్ రెడ్డి, యూఎస్ ప్రకాష్, మాజీ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ సంక ప్రసాద్, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు నారం రాజశేఖర్, ఆధ్వర్యంలో గ్రామగ్రామాన ఈ సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి గ్రామాన్ని సందర్శిస్తూ స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమక్షంలో బీఎల్ఏలను అభినందించి వారి సేవలను గుర్తించారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో బీఎల్ఏల పాత్ర కీలకమని నాయకులు పేర్కొన్నారు. గ్రామస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని మరింత సమన్వయంతో ముందుకు తీసుకెళ్లడంతో పాటు రాబోయే రాజకీయ సవాళ్లను ఎదుర్కొనేలా కార్యకర్తల్లో నూతన ఉత్సాహం నింపే విధంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అశ్వారావుపేట మండలంలో బీఆర్ఎస్ శ్రేణులు క్షేత్రస్థాయిలో మరింత చురుగ్గా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నాయని నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఉప్పల్ నియోజకవర్గంలోని 190 ఆలయాలకు రూ.56.17 లక్షల చెక్కుల పంపిణీ

**-బోనాల నిర్వహణకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోంది**

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**ఉప్పల్ :**

బోనాల మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆలయాలకు భారీ ఎత్తున నిధులు మంజూరు చేస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఆలయాలకు రూ.20 కోట్లకు పైగా నిధులు కేటాయించిన ప్రభుత్వం, భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవాలు నిర్వహించుకునేలా అన్ని ఏర్పాట్లు చేస్తోందని పేర్కొన్నారు.ఉప్పల్ నియోజకవర్గంలోని 190 ఆలయాలకు మొత్తం రూ.56,17,500 విలువైన చెక్కులను గురువారం ఎంజీఆర్ఐ అభయాంజనేయ స్వామి దేవాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డితో కలిసి ఆలయ కమిటీల ప్రతినిధులకు పంపిణీ చేశారు.ఈ



సందర్భంగా బీరప్పగడ్డ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అకిటి ఆగం రెడ్డి మాట్లాడుతూ, ఉప్పల్ నియోజకవర్గంలోని ఆలయాలకు రూ.56.17 లక్షల నిధులు మంజూరు చేయించడంలో ప్రత్యేక కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆలయాల అభివృద్ధి, సంప్రదాయ పండుగల నిర్వహణకు ప్రభుత్వం అందిస్తున్న సహకారం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో చెర్లపల్లి మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, కాప్రా మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి,



దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వాహక అధికారి వెంకన్న, ఆలయ కమిటీల ప్రతినిధులు,దేవాదాయ శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం

**-45 యూనిట్ల రక్తం సేకరణ..**

**-విద్యార్థులు,అధ్యాపకుల విశేష స్పందన**

**ఉప్పల్ :**

సమాజ సేవే లక్ష్యంగా ఉప్పల్లోని లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) విభాగం, లైఫ్ క్లబ్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో గురువారం మాంట్ఫోర్ట్ హాల్లో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించింది. విద్యార్థులు, అధ్యాపకులు, బోధన, బోధనేతర సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొని సామాజిక బాధ్యతను చాటుకున్నారు.కార్యక్రమాన్ని కళాశాల డైరెక్టర్ రెవ. బ్రదర్ జాన్ కల్లరక్కల్, ప్రిన్సిపాల్ శ్రీమతి పి. జయంతి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రక్తదానం అనేది ప్రాణదానంతో సమానమైన గొప్ప మానవతా సేవ అని పేర్కొన్నారు. ప్రమాదాలు, అత్యవసర వైద్య పరిస్థితులు, తలసేమియా, క్యాన్సర్ వంటి వ్యాధులతో బాధపడుతున్న రోగులకు స్వచ్ఛంద రక్తదానం ఎంతో ఉపయోగపడుతుందని, యువత ఈ దిశగా ముందుండాలని పిలుపునిచ్చారు.ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి చెందిన డాక్టర్ రామ సుబ్బారెడ్డి, వైద్య బృందం రక్తదాతలకు



ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, రక్తదానానికి సంబంధించిన అర్హతలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం అర్హులైన విద్యార్థులు, అధ్యాపకులు, బోధన, బోధనేతర సిబ్బంది ఉత్సాహంగా రక్తదానం చేశారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు నమోదు ప్రక్రియతో పాటు రక్తదాతలకు అవసరమైన సహాయాన్ని అందిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.శిబిరంలో మొత్తం 45 యూనిట్ల రక్తాన్ని సేకరించి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి అందజేశారు. ఈ రక్తాన్ని ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న తలసేమియా, క్యాన్సర్ తదితర రోగుల అవసరాల కోసం వినియోగించనున్నట్లు వైద్య బృందం తెలిపింది.కార్యక్రమం ముగింపులో రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. "ఒకరి






రక్తదానం.. మరొకరి ప్రాణరక్షణ" అనే సందేశంతో స్వచ్ఛంద రక్తదానంపై అవగాహన కల్పిస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించారు.

## అజ్ఞానం మోసగాళ్లకు ఆయుధం.. అవగాహనే ప్రజలకు రక్షణ కవచం

**-చట్టాలపై అవగాహన పెంపొందించుకుంటేనే మోసాలను అరికట్టగలం:రాజలింగు మోతె**

**మంచిర్యాల**

సమాజంలో రోజురోజుకు పెరుగుతున్న మోసాలకు అజ్ఞానం, చట్టాలపై అవగాహన లేకపోవడమే ప్రధాన కారణమని ప్రజా జాగృతి సమితి అధ్యక్షుడు, న్యాయవాది రాజలింగు మోతె అన్నారు.ప్రజల్లో చట్టపరమైన అవగాహన పెంపొందించేందుకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన పలు కీలక సూచనలు చేశారు.ఉద్యోగాలు ఇప్పిస్తామని, విదేశాలకు పంపిస్తామని, వివాహాలు జరిపిస్తామని, అధిక లాభాలు వచ్చే పెట్టుబడుల పేరుతో, అలాగే బ్యాంకు కేవైసీ, ఓటీపీలు, లాటరీలు, బహుమతులు, నకిలీ వెబ్సైట్లు, సామాజిక మాధ్యమాల ద్వారా మోసగాళ్లు అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని భారీ ఎత్తున మోసాలకు పాల్పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ తరహా మోసాలకు విద్యావంతులు సైతం బలవుతుండటం ఆందోళన కలిగించే విషయమన్నారు.మోసాలకు గురైన తర్వాత బాధితులు పోలీస్ స్టేషన్లు, కోర్టులు, న్యాయవాదుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, దీనివల్ల విలువైన సమయం, డబ్బుతో పాటు మానసిక ప్రశాంతత కూడా కోల్పోవాల్సి వస్తోందన్నారు. అందువల్ల మోసపోయిన తర్వాత



చర్యలు తీసుకోవడం కంటే ముందుగానే అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటించడమే ఉత్తమ మార్గమని సూచించారు.తెలియని వ్యక్తులను గుడ్డిగా నమ్మవద్దని, పూర్తిగా చదవకుండా ఎలాంటి పత్రాలపై సంతకాలు చేయవద్దని, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, పాస్వర్డు ఎవరికీ వెల్లడించవద్దని ప్రజలకు సూచించారు. ప్రతి ఆర్థిక లావాదేవీకి సంబంధించిన రాతపూర్వక ఆధారాలను భద్రపరచుకోవాలని, అనుమానం వచ్చిన వెంటనే పోలీసులను లేదా న్యాయ నిపుణులను సంప్రదించాలని కోరారు.అవగాహన ఉన్న సమాజంలో మోసాలకు అవకాశం చాలా వరకు తగ్గుతుందని రాజలింగు మోతె పేర్కొన్నారు. ప్రతి కుటుంబం, ప్రతి యువకుడు, ప్రతి మహిళ చట్టాలపై కనీస అవగాహన పెంపొందించుకోవాలని, అదే సమాజ భద్రతకు బలమైన పునాదిగా నిలుస్తుందని



అన్నారు.అజ్ఞానం మోసానికి ద్వారం... అవగాహన భద్రతకు ఆధారం" అనే సందేశాన్ని ప్రతి పౌరుడు జీవితంలో ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. చట్టాలను తెలుసుకోవడం, హక్కులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు.

## గద్దర్ ఆశయాలను కొనసాగించాలి

**తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నరసయ్య**




**హనుమకొండ:**

ప్రజా యుద్ధ నౌక గద్దర్ ఆశయాలను కొనసాగించాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నరసయ్య అన్నారు. గురువారం వారి మూడవ వర్ధంతిని పురస్కరించుకొని తెలంగాణ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనకు వారు చేసిన సేవలు మరువ లేనివని గుర్తు చేశారు.వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.నేటి రోజుల్లో ప్రజల్లో వారి ని నాదాన్ని అన్ని ప్రజా సంఘాలు అభ్యుదయవాదులు,స్వచ్ఛంద సంస్థల అధినేతలు ఐక్యంగా ఉండి ముందుకు సాగాలని అన్నారు.కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెల్మకంటి దయాకర్, రాష్ట్ర అధికార ప్రతినిధి తూముల సదానందం,జిల్లా అధ్యక్షులు గొర్రె థామస్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇసంపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.